సాక్షి ప్రకాశం

శనివారం । 30 । డిసెంబర్ । 2023



ట్రక్ ఆటో.. ఆర్టీసీ బస్సు ఢీ

కొనకనమిట్ల మండలం మర్రిపాలెం వద్ద ట్రక్ ఆటో–ఆర్టీసీ బస్సు ఢీకొని ఐదుగురికి గాయాలయ్యాయి. ట్రక్ డ్రైవర్ శివశంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. - 8లో..



కన్నుల పండువగా అమ్మవారి నగరోత్సవం

చీమకుర్తిలో కనకదుర్గమ్మ నగరోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
29/21

వాతావరణం

ఉదయం పొగ మంచు ఎక్కువగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

● జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ



డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ

ఒంగోలు టౌన్: ఇంట్లో, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూడాలని జిల్లా మలేరియా అధికారిణి అల్లడి జ్ఞానశ్రీ కోరారు. ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని దత్తాత్రేయకాలనీలో ఆమె పర్యటించారు. కాలనీలో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగి మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోధకాలు వంటివి ప్రబలే ప్రమాదం ఉందని చెప్పారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు, రక్షణ పొందేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పూలకుండీలు, పాత వస్తువులు, వాడి పారేసిన సైకిల్ టైర్లు లాంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బోధకాలు నిర్ధారణకు రక్త నమూనాల సేకరణ...

జిల్లాలో బోధకాలు నివారణకు పలు ప్రాంతాల్లో రక్త నమూనాలను సేకరించినట్లు జ్ఞానశ్రీ తెలిపారు. కరవది, పెద్ద నాగులవరం, కురిచేడు, అనుమలవీడు, యాచవరం, నంద నమారెళ్ల, ఒంగోలు పట్టణంలోని బట్టువానికుంట పరిధిలో బోధకాలు నిర్ధారణకు రక్త నమూనాలను సేకరించినట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ సేకరణ 30వ తేదీతో ముగుస్తుందని, ఏదైనా అనుమానం ఉంటే ఈ కార్యక్రమంలో రక్త పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. మలేరియా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై శ్రద్ధ

● డీఆర్‌ఓ శ్రీలత



ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహిస్తున్న డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపడుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) శ్రీలత తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహించి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సర్వీసు అంశాల్లో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పనిచేసే ప్రదేశంలో ఉద్యోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఉద్యోగులు అందజేసిన అర్జీలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించేలా నిబంధనల మేరకు కావాల్సిన అవసరాలు తీరుస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి, ఇతర అధికారులు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.


స్ట్రాంగ్ రూములకు మరమ్మతులు చేపట్టాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు

ఒంగోలు అర్బన్: రాబోయే సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉన్న స్ట్రాంగ్ రూములను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టి సిద్ధం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. క్లెయిమ్‌ల పరిష్కారం, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, వీవీ ప్యాట్‌ల డెమో ప్రదర్శన, తదితర అంశాలపై సీఈఓ ఆరా తీశారు. అనంతరం సంబంధిత అంశాలపై ఈఆర్‌ఓలతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీలత, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు విశ్వేశ్వరరావు, జాన్‌ఇర్విన్, ఈఆర్‌ఓలు లోకేశ్వరరావు, నారదముని, వరకుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



కోవిడ్ మహమ్మారి మరోసారి ఆందోళన కలిగిస్తోంది. కొత్తగా వచ్చిన జేఎన్–1 వేరియంట్ కేసులు పలు రాష్ట్రాల్లో నమోదవుతుండటంతో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. ఒంగోలులోని జీజీహెచ్‌లో ఇప్పటికే ఆర్టీపీసీఆర్ పరీక్షలు ప్రారంభించారు. వైద్య సిబ్బంది మాక్‌డ్రిల్ కూడా నిర్వహించి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో ర్యాపిడ్ టెస్ట్‌లు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పండుగల సీజన్ కావడంతో వైరస్ వ్యాప్తి చెందే అవకాశం అధికంగా ఉందంటున్నారు. ప్రజలంతా ముందు జాగ్రత్త చర్యగా రద్దీ ప్రాంతాల్లో మాస్క్‌లు ధరించాలని సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పక్కా చర్యలతో ప్రజలకు భరోసా లభిస్తోంది.

- ఆందోళన కలిగిస్తున్న కోవిడ్–19 జేఎన్–1 వేరియంట్
- పండుగల సీజన్‌తో పొంచి ఉన్న వ్యాప్తి ముప్పు
- అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ
- ఒంగోలు జీజీహెచ్‌లో వారం నుంచి ఆర్టీపీసీఆర్ పరీక్షలు
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో సైతం మెరుగైన వైద్య సౌకర్యాలు
- మాస్క్ వాడాలని ప్రజలకు వైద్యుల విజ్ఞప్తి
- భరోసా ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలు



ఒంగోలు జీజీహెచ్‌లో వారం క్రితం ప్రారంభించిన ఆర్టీపీసీఆర్ పరీక్షలు

అటెన్షన్ ప్లీజ్..!

ఒంగోలు టౌన్: దేశంలోకి మళ్లీ కరోనా భూతం వచ్చింది. కోరలు చాచకముందే ప్రజలను భయపెడుతోంది. సరిగ్గా రెండేళ్ల క్రితం కరోనా సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ఎందరినో పొట్టన పెట్టుకుని తీరని విషాదాన్ని మిగిల్చిన విషయం ఇంకా కళ్ల ముందు కదలాడుతోంది. ఆరోగ్యాన్ని దెబ్బ తీయడమే కాదు.. వ్యాపారాలను సైతం అతలాకుతలం చేసింది. రెడ్‌జోన్ విధించడంతో ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టలేక ప్రజలు నానా అవస్థలు పడ్డారు. అవన్నీ ఇప్పుడు గుర్తు చేసుకుని భయాందోళనకు గురవుతున్నారు. చాపకిందనీరులా కరోనా ప్రబలుతుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు. గతంలో తీసుకున్న జాగ్రత్తలన్నీ ఇప్పుడు కూడా పాటించడం చాలా అవసరమని చెబుతున్నారు.

భయపెడుతున్న పండుగలు...

సహజంగా ఏదైనా పండుగ వస్తుందటే హడావిడి మొదలవుతుంది. అందులోనూ సంక్రాంతి లాంటి పెద్ద పండుగ హడావిడి మరింత ఎక్కువగా ఉంటుంది. నూతన సంవత్సర వేడుకల నుంచే ఈ సందడి షురూ అవుతుంది. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడాలు...పుచ్చుకోవడాలు.. కేకులు కట్ చేసుకుని ఛీర్స్ చెప్పుకోవడం.. ఎటుచూసినా సంబరాలు కనిపిస్తాయి. అయితే ఈసారి కరోనా కాచుకుని కూర్చుంది. అందువలన ప్రజలు సంబరాల జోరులో పడి చేజేతులా కరోనా బారిన పడవద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గతంలో వ్యవహరించినట్టే భౌతిక దూరం పాటించడంతో పాటుగా ఎవరితోనైనా చేతులు కలిపి షేక్ హ్యాండ్ ఇవ్వాల్సి వస్తే వెంటనే శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకోవడం లాంటి జాగ్రత్తలు పాటించడం మేలని చెబుతున్నారు. అవసరమైతేనే బయటికి వెళ్లాలని, ప్రయాణాలు వంటివి చేయాలని, పెళ్లిళ్లు వంటి కార్యక్రమాలకు వెళ్లినప్పుడు సాధ్యమైనంత వరకు జనం మధ్య ఉండకుండా జాగ్రత్తపడాలని సూచిస్తున్నారు.

వైద్య వసతులు భేష్...

2020లో కరోనా వచ్చినప్పుడు రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నర్సింగ్ స్టాఫ్ సైతం సరిపడినంతగా లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. అలాంటి అరకొర వసతులతో కరోనాతో తీవ్రమైన యుద్ధం చేసింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. ఎలాగైనా సరే ప్రజల ప్రాణాలను కాపాడాలన్న సంకల్పంతో రంగంలోకి దిగింది. అటు వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న అనేక ఉద్యోగాలను భర్తీ చేస్తూనే.. ఉన్న సిబ్బందితో కరోనా రోగులకు వైద్య సేవలు అందించి ప్రాణ నష్టం తగ్గించింది. ఆ తర్వాత సీఎం జగన్ వైద్య రంగానికి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రంలోని వైద్యశాలల్లో సిబ్బంది కొరత లేకుండా చేశారు. ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చారు. నాణ్యమైన మందులు సరఫరా చేశారు. నాడు–నేడులో ప్రాథమిక వైద్యశాలలను నిర్మించారు. దీంతో ఇప్పుడు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వైద్య సౌకర్యాలు కలిగిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. మారుమూల గ్రామీణ ప్రజలకు సైతం అత్యంత ఆధునిక వైద్యాన్ని అందిస్తుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు కరోనాను ఎదుర్కొనేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది సంసిద్ధంగా ఉన్నారు. అన్ని సౌకర్యాలతో అప్రమత్తంగా ఉన్నారు. ప్రజలకు ఆరోగ్య భరోసా ఇస్తున్నారు.

ప్రాథమిక వైద్యశాలలు సైతం సిద్ధం...

జిల్లాలో 63 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. కేవలం ఒక్క ఒంగోలు నగరంలోనే 9 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క ఆరోగ్య కేంద్రంలో కనీసం ఏడుగురికి తక్కువ కాకుండా సిబ్బంది అందుబాటులో ఉన్నారు. నగరంలోని శివారు ప్రాంతాలన్నిటిలోనూ ఇళ్ల దగ్గరే ఈ ఆరోగ్య కేంద్రాలు ఉండటంతో ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయి. ఈ వైద్యశాలల్లో 4 నుంచి 6 పడకలు సిద్ధంగా ఉండటమే కాకుండా 174 రకాల మందులు అందుబాటులో ఉంచారు. ప్రాథమిక వైద్యశాలల్లో 126 మందికిపైగా వైద్యులు ఉన్నారు. ఈ వైద్యశాల సిబ్బంది మాత్రమే కాకుండా అదనంగా సచివాలయ వలంటీర్లు కూడా అందుబాటులో ఉన్నారు. ఇంటింటికీ తిరిగి వైద్య సేవలు అందించే ఆశా వర్కర్లు సైతం అత్యవసర పరిస్థితిలో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. అందువలన కరోనా లాంటి క్లిష్టమైన పరిస్థితులను సులువుగా ఎదుర్కొనేందుకు ఆరోగ్య సైన్యం సంసిద్ధంగా ఉందన్న భరోసా ప్రజల్లో కనిపిస్తోంది.

వలంటీర్లే లేకపోతే...

రెండేళ్ల క్రితం కరోనా వచ్చినప్పటి పరిస్థితిని చాలా మంది గుర్తు చేసుకుంటున్నారు. ప్రజల ప్రాణాలు రక్షించాల్సిన వైద్యశాలలకు కూడా కరోనా దెబ్బకు తాళాలు వేశారు. పేరున్న పెద్ద పెద్ద వైద్యులు సైతం గడప దాటి బయటకు రాలేదు. అలాంటి భయానక పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచింది గ్రామ సచివాలయాలే. ప్రాణాలకు తెగించి ఇంటింటికి తిరిగి ప్రజలకు భరోసా ఇచ్చింది వలంటీర్లే. నిజంగా ఆనాడు సచివాలయాలే లేకపోతే.. వలంటీర్లే లేకపోతే పరిస్థితులు చాలా ఘోరంగా ఉండేవన్నది నగ్న సత్యం. ప్రభుత్వ పథకాలనే కాదు.. రేషన్, కూరగాయలను సైతం వలంటీర్లు దగ్గరుండి పంపిణీ చేయడం యావత్ ప్రపంచం చూసింది. కరోనా సోకిన వారి వివరాలను అధికారులకు తెలియజేయడమే కాకుండా వారిని ఐసోలేషన్‌కు పంపించడం, చికిత్స అందేలా చేయడం, ఆహారం అందక ఇబ్బంది పడుతున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సహాయాన్ని అందజేయడం లాంటివన్నీ వలంటీర్లే చేశారు. ఆపదలో ఉన్న వారందరినీ దేవుళ్లలా ఆదుకున్నారు.

మాస్క్ పెట్టుకుంటే మేలు...

తాజాగా కలకలం సృష్టిస్తున్న కరోనా జేఎన్–1 వేరియంట్ అంతగా ప్రమాదకారి కాదని వార్తలు వస్తున్న నేపథ్యంలో కొందరు వ్యక్తులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. జేఎన్–1 ప్రమాదకరం కాకపోయినా.. చివరికి ఇది ఎలాంటి మలుపు తీసుకుంటుందో చెప్పలేని పరిస్థితులు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. అందుకే కరోనా మహమ్మారికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని సూచిస్తున్నారు. ప్రజలు నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే ముందస్తు చర్యలు తీసుకోవడం మంచిదంటున్నారు. మాస్క్ వాడకంతో కరోనా వ్యాప్తి వేగానికి బ్రేక్ వేసేందుకు సంసిద్ధం కావాల్సిన అవసరం ఉందంటున్నారు. కేవలం మాస్క్‌తో సరిపెట్టకుండా భౌతిక దూరం కూడా పాటించడం మేలని అంటున్నారు.

మాస్క్ ధరించడం మంచిది



ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనిస్తున్నాం. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం. కోవిడ్ పరీక్షలు, చికిత్స, మందులు అందుబాటులో ఉంచాం. ర్యాపిడ్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చినప్పటికీ ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేసిన తర్వాతే కోవిడ్‌ను నిర్ధారించాల్సి ఉంటుంది. ఏదేమైనా ప్రజలు తగిన జాగ్రతలు తీసుకోవడం మంచిది. వచ్చే నెలలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో రద్దీ ప్రాంతాల్లో మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం వంటి కనీస చర్యలతో కోవిడ్ నుంచి రక్షణ సాధ్యమవుతుంది.

– డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

పాజిటివ్ కేసులు లేవు



జిల్లాలో ఇప్పటి వరకు పాజిటివ్ కేసులు లేవు. ఇటీవల హైదరాబాద్ నుంచి చినగంజాం మండలంలోని గొలసపూడి గ్రామానికి వచ్చిన గర్భిణికి కోవిడ్ లక్షణాలుగా అనుమానించి ఒంగోలు జీజీహెచ్‌కి తీసుకొచ్చారు. ఆమెతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు కూడా ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయించగా, నెగిటివ్ రిపోర్టు వచ్చింది. జీజీహెచ్‌లో అన్ని విభాగాలకు చెందిన వైద్యులను అప్రమత్తం చేయడం జరిగింది. కోవిడ్ కోసం ప్రత్యేకంగా 200 పడకలతో పాటు 1000 ఆక్సిజన్ సిలిండర్లు, 3 ఆక్సిజన్ ప్లాంట్లు సిద్ధంగా ఉన్నాయి. అన్ని రకాలుగా కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.

– డాక్టర్ భగవాన్ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్, ఒంగోలు

అభివృద్ధిని అడ్డుకుంటారా..?

- టీడీపీ కార్పొరేటర్లపై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల ధ్వజం
- నగర సుందరీకరణకు కేటాయించిన రూ.3.59 కోట్లు నిబంధనలకు విరుద్ధమంటూ టీడీపీ సభ్యుల రచ్చ
- ఘాటుగా సమాధానమిచ్చిన అధికార వైఎస్సార్ సీపీ సభ్యులు
- రెండేళ్లు కరోనా ఇబ్బందిపెట్టినా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని నగరాన్ని అభివృద్ధి చేశారని వెల్లడి
- మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన ఒంగోలు నగరపాలక సంస్థ అత్యవసర సమావేశం



పాల్గొన్న కార్పొరేటర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరం అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడటమే పనిగా పెట్టుకున్నారు ప్రతిపక్ష టీడీపీ కార్పొరేటర్లు. నగరంలో ఏ అభివృద్ధి కార్యక్రమానికి ప్రతిపాదనలు పెట్టినా టెక్నికల్ అంశాలను తెరపైకి తీసుకొచ్చి రచ్చ చేస్తున్నారు. అధికార వైఎస్సార్ సీపీ పాలకమండలి నగరాన్ని అభివృద్ధి చేస్తుంటే.. సహేతుకమైన లోపాలు ఉంటే ఎత్తిచూపించాల్సిన ప్రతిపక్ష టీడీపీ సభ్యులు.. అసలు అభివృద్ధి పనులే చేపట్టకూడదంటూ వితండవాదానికి దిగుతున్నారు. ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో అక్షరాలా అదే జరిగింది. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. నగరంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు, సిబ్బంది సంఖ్యను పెంచుకోవడానికి, ఇతర విభాగాల్లో సాంకేతిక పరంగా వాహనాల సంఖ్య, ఇతర మౌలిక వసతులు పెంచుకునేందుకు కౌన్సిల్‌లో ఆమోదం కోసం పెట్టారు. దీనిపై టీడీపీ సభ్యుల చిందులు అన్నీఇన్నీ కావు. 50 మంది సభ్యులుండే కౌన్సిల్‌లో టీడీపీ సభ్యులు ఆరుగురు, ఒక జనసేన సభ్యుడు ఉన్నారు. ఈ ఏడుగురు ఒకరిని మించి ఒకరు నగర అభివృద్ధి కోసం చేస్తున్న ప్రతిపాదనలను అడ్డుకునే పనిలో నిమగ్నమయ్యారు. వారి నాయకుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నియోజకవర్గంలో అభివృద్ధిని అడ్డుకుంటున్నట్లే.. ఈ సభ్యులు కూడా ఒంగోలు నగర అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్న విషయం స్పష్టమవుతోంది. నగరంలో పెరిగిన జనాభాకు తగ్గట్టుగా నగరపాలక సంస్థలో సిబ్బంది, వాహన సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసం సమావేశంలో ప్రతిపాదనలు పెడితే టెక్నికల్‌గా అలా పెట్టకూడదు, ఇలా పెట్టకూడదంటూ సమావేశాన్ని అడ్డుకున్నంత పనిచేశారు టీడీపీ సభ్యులు. అయితే, అధికార వైఎస్సార్ సీపీ సభ్యులు దీటుగా ఎదుర్కొని టీడీపీ సభ్యులను కట్టడి చేశారు. టీడీపీ సభ్యులు అడ్డుకుంటున్న తీరుపై ఆగ్రహించిన డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు తీవ్రస్థాయిలో స్పందించారు. టీడీపీ అధికారంలో చేసిన పాపాలను ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ కడుగుతోందంటూ ధ్వజమెత్తారు. అభివృద్ధి పనుల్లో భాగంగా టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి వర్క్‌నూ టెండర్ ధర కంటే తక్కువకు వేయించి పనులు చేయించి చివరకు బిల్లులు ఇవ్వకుండా చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టిందన్నారు. అలాంటి రూ.40 కోట్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక చెల్లిందని తెలిపారు. రెండేళ్లు కరోనాలో కూడా ఎక్కడా తగ్గకుండా ప్రజలకు సేవ చేసుకుంటూ అభివృద్ధి పనులు చేస్తున్నామని గట్టిగా బదులిచ్చారు. ఐదేళ్లు ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డి ఏం చేశారని టీడీపీ సభ్యులు అడిగిన దానికి వెలనాటి ఘాటుగా సమాధానమిచ్చారు. కరోనా సమయంలో టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో పాటు కౌన్సిల్‌లోని టీడీపీ ఫ్లోర్ లీడర్ దాచర్ల రమణయ్య కూడా బయటకు రాలేదని గుర్తుచేశారు. ఎమ్మెల్యే వాసన్న మాత్రం స్వచ్ఛందంగా ఎంత సేవ చేశారో ఒంగోలు నగరంతో పాటు జిల్లా ప్రజలకు తెలుసని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎప్పుడెప్పుడు ఏ విధంగా ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని అభివృద్ధి చేశారో వివరించారు. ఒంగోలు నగర సుందరీకరణ కోసం ప్రత్యేకంగా నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాంలో భాగంగా రూ.3.59 కోట్లతో 8 పనులు మంజూరు చేసి వాటి అనుమతి కోసం కౌన్సిల్‌లో ఆమోదానికి పెడితే వాటిని కూడా ఆమోదించటానికి లేదని టీడీపీ సభ్యులు అడ్డుతగిలారు.. సీఎఫ్ఎంఎస్ విధానాన్ని తీసుకొచ్చి చంద్రబాబు చేసిన పాపం ఎన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టాయో అందరికీ తెలుసని వెలనాటి అన్నారు.

పారిశుధ్య కార్మికులు సమ్మె చేయడం దారుణం...

పారిశుధ్య కార్మికులు సమ్మె చేయడం అత్యంత దారుణమని 19వ డివిజన్ కార్పొరేటర్ ఈదర సురేష్‌బాబు(చిన్నారి) ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఇచ్చింది నెలకు రూ.12 వేలని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.6 వేలు పెంచి రూ.18 వేలు చేశారన్నారు. అదేవిధంగా టీఏలు, డీఏలు, ఇతర అలవెన్స్‌లు కలిపి మరో రూ.3 వేలు పెంచారని గుర్తు చేశారు. మొత్తం రూ.21 వేలు ఇస్తుంటే కొందరు దుష్టుల మాటలు విని పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్నారన్నారు. నగరంలో ప్రజలకు ఇచ్చే మంచి నీటిలో క్లోరినేషన్ సక్రమంగా చేయటం లేదని, దుర్వాసనతో కూడిన నీటిని విడుదల చేస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. కొప్పోలు ప్రధాన డ్రైనేజీ కాలువ నిర్మాణం విషయంలో టీడీపీ నాయకులు రాద్ధాంతం చేయడాన్ని అధికార వైఎస్సార్ సీపీ సభ్యులు తిప్పికొట్టారు. టీడీపీ సభ్యులకు ప్రజల సంక్షేమం, భద్రత అసలు పట్టడం లేదని, ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం మాత్రమే తెలుసని ధ్వజమెత్తారు. టీడీపీ సభ్యుల తీరు ఎలా ఉందంటే కాకతీయ నగర్‌లోని పార్కుకు లోటస్ పార్కుగా పేరు మార్చాలని తీర్మానం పెడితే అది కూడా మార్చడానికి లేదని అడ్డుకున్నారు. అయితే, ఎన్నిరకాలుగా టీడీపీ సభ్యులు అడ్డుకున్నా సభ్యుల బలం ఎక్కువగా ఉన్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ప్రతి అంశాన్ని ఏకగ్రీవంగా ఆమోదింపజేసుకున్నారు. పాత రిమ్స్‌లో ఇంటిగ్రేటెడ్ సైనిక్ భవన్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి), ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, ఎంఈ జానీ, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

పేదల చదువుకు ప్రభుత్వం అండ



విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, అధికారులు

- జగనన్న విద్యాదీవెన ద్వారా జిల్లాలో రూ.30,92,72,774 పంపిణీ
- ఇప్పటి వరకు నాలుగు విడతల్లో రూ.138,50,59,495 అందజేత
- చెక్కు అందించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పేద కుటుంబాల పిల్లలు పెద్ద చదువులు చదువుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, విద్యా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. జగనన్న విద్యాదీవెన పథకంలో భాగంగా అర్హుల తల్లుల ఖాతాల్లో నాలుగో విడత నిధులు జమచేస్తున్న నేపథ్యంలో శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి అనుబంధంగా స్థానిక ప్రకాశం భవనంలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని లబ్ధిదారులకు బ్యాంకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగో విడత జిల్లాలో 41,868 మంది విద్యార్థులకు సంబంధించి 38,280 మంది తల్లులకు రూ.30,92,72,774 ప్రయోజనం కలుగుతున్నట్లు తెలిపారు. లబ్ధిదారులైన విద్యార్థుల్లో 13,624 మంది ఎస్సీ, 1,028 మంది ఎస్టీ, 12,584 మంది బీసీ, 9,890 మంది ఈబీసీ, 2,413 మంది ముస్లిం మైనార్టీ, 2,266 మంది కాపులు, 45 మంది క్రిస్టియన్ మైనార్టీలు ఉన్నట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా నాలుగు విడతల్లో కలిపి రూ.138,50,59,495 ఆర్థిక సహాయం లబ్ధిదారులకు అందిందన్నారు. ఉన్నత చదువులకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా దీవెన పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తూ పేద విద్యార్థులకు తోడుగా ఉంటోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట రవిబాబు, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, బీసీ సంక్షేమ అధికారి అంజల, దివ్యాంగుల సంక్షేమ అధికారి అర్చన, మైనారిటీ సంక్షేమ అధికారి సునీల్ కన్నా అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం

ఒంగోలు సెంట్రల్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించుకోవడం ద్వారా రైతులకు ఆదాయంతో పాటు ప్రజలకు ఆరోగ్యం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి తెలిపారు. ఇలపావులూరులో మండల మహిళా సమాఖ్య పాలకవర్గ సభ్యులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ప్రధాన పంట ఉల్లిలో అంతర పంటలుగా కంది, జొన్న ఏ గ్రేడ్ మోడల్ సాగుచేస్తున్నారు. వాటిని పరిశీలించి పాటిస్తున్న పద్ధతుల గురించి సుభాషిణి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం గురించి పొదుపు సంఘాలకు తెలిపి సాగు మరింత పెరిగేలా కృషి చేయాలని సూచించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నకిలీ వేలిముద్రల సామగ్రి స్వాధీనం



వేలిముద్రలు తయారు చేసే పరికరాలను చూపుతున్న ఎస్సై సుదర్శన్

త్రిపురాంతకం: నకిలీ వేలిముద్రలు తయారు చేసి యాప్ ద్వారా అక్రమంగా డబ్బు కాజేస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ పాపారావు, ఎస్సై సుదర్శన్ తెలిపారు. త్రిపురాంతకం మండలం మేడపి గ్రామంలో యాప్ ద్వారా వేలిముద్రలు వేయించుకుని అక్రమంగా డబ్బు తీసుకుంటున్నారని గ్రామస్తులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు మేడిపి గ్రామానికి చెందిన షేక్ జాన్ బాషా, అర్ధవీడు మండలం మావుటూరు గ్రామానికి చెందిన దేశావత్ ఉదయ్‌కిరణ్ నాయక్, దోర్నాల పంచాయతీ చెంచుకాలనీకి చెందిన షేక్ మదార్‌ను అరెస్ట్ చేశారు. మేడిపిలో షేక్ జాన్‌బాషా ఇంట్లో నకిలీ వేలిముద్రలు తయారు చేసే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కొనకనమిట్ల: గొట్లగట్టులో కబడ్డీ మ్యాచ్‌లో తలపడుతున్న బాలికలు



సింగరాయకొండ జెడ్పీ హైస్కూల్లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



దర్శి ప్రభుత్వ కాలేజీలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థినులు

హోరా హోరీగా..

సచివాలయాల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం జిల్లాలోని అన్ని గ్రామాల్లో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో పోటీల్లో యువతీయువకులు, విద్యార్థులు పోటీపోటీగా తలపడ్డారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

– సాక్షి నెట్‌వర్క్



దర్శి ప్రభుత్వ కాలేజీలో ఖోఖో ఆడుతున్న బాలికలు



మద్దిపాడు : ఇనమనమెళ్లూరులో ఖోఖోలో డైవ్ కొట్టి ఔట్ చేస్తున్న యువకుడు



కనిగిరి : ఖోఖోలో హోరాహోరీగా తలపడుతున్న బాలికలు



కనిగిరి : వాలీబాల్ ఆడుతున్న యువకులు



మార్కాపురం : ఇడుపూరులో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

జనవరి 7న సంక్రాంతి సరాగాలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కల్చరల్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 7న 'సంక్రాంతి సరాగాలు' పేరిట కార్యక్రమం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాగంటి శ్రీనివాసమూర్తి తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్ర.ర.సం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు, ఆలిండియా కళారంగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, సీనియర్ గాయని శ్రీదేవి పాల్గొన్నారు.

- కొనకనమిట్ల మండలం మర్రిపాలెం సమీపంలో ఘటన
- ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ట్రక్ ఆటో.. ఆర్టీసీ బస్సు ఢీ





గాయపడిన డ్రైవర్లు ఆంజనేయులు, శివశంకర్



సంఘటనా స్థలంలో గుమిగూడిన స్థానికులు

కొనకనమిట్ల: వేగంగా వెళ్తున్న ట్రక్ ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటన జాతీయ రహదారిపై కొనకనమిట్ల మండలం మర్రిపాలెం సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్, ట్రక్ డ్రైవర్ సహా ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు.. ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో మార్కాపురం నుంచి ఒంగోలు వెళ్తోంది. వాగుమడుగు గ్రామానికి చెందిన శివశంకర్ తన ట్రక్ ఆటోతో మార్కాపురం వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో మర్రిపాలెం సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ట్రక్ ఆటో ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. బస్ ముందు భాగం దెబ్బతిని రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. దీంతో బస్ డ్రైవర్ ఆంజనేయులుకు గాయాలు కాగా ట్రక్ డ్రైవర్ శివశంకర్‌కు కాలు విరగడంతో పాటు తీవ్రంగా గాయపడ్డాడు. బస్‌లో ఉన్న చెన్నమ్మ, నాగిరెడ్డి, ఫ్రాన్సిస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న మర్రిపాలెం గ్రామస్తులతో పాటు అదే మార్గంలో వెళ్తున్న వాహనదారులు బస్, ట్రక్ ఆటోల్లో ఇరుక్కుపోయిన డ్రైవర్లను బయటికు తీసి సపర్యలు చేశారు. స్పృహ తప్పిన ఆర్టీసీ డ్రైవర్ ఆంజనేయులుతోపాటు ట్రక్ డ్రైవర్‌కు 108 వాహన సిబ్బంది కాశీంవలి, సురేష్‌బాబు ప్రథమ చికిత్స చేసి మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని కొనకనమిట్ల ఎస్సై బ్రహ్మనాయుడు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



స్వల్పంగా గాయపడిన చెన్నమ్మ, నాగిరెడ్డి, ఫ్రాన్సిస్

మార్కాపురం నుంచి ఒంగోలు వెళ్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి సంఘటనా స్థలంలో ఆగి పరిశీలించారు. గాయపడిన వారి వివరాలు తెలుసుకుని ఆస్పత్రికి తరలించేందుకు కృషి చేశారు.

చెరువులో పడి యువకుడు మృతి



జజ్జర నందు(ఫైల్)

టంగుటూరు: చెరువులో జారి పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని గ్రామస్తుల సహకారంతో పోలీసులు బయటకు తీశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి జజ్జర నందు(19) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. బుధవారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన నందు చెరువులో జారి పడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. తెల్లవారుజామున మృతదేహం పైకి తేలడంతో గ్రామస్తులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

కన్నుల పండువగా అమ్మవారి నగరోత్సవం



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి



సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కలశాలతో బారులుదీరిన భక్తులు

చీమకుర్తి: శ్రీకనకదుర్గ భవానీ అమ్మవారి నగరోత్సవ వేడుకలు శుక్రవారం చీమకుర్తిలో కన్నులపండుగలా జరిగింది. అమ్మవారికి సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా విశేష పూజలు నిర్వహించారు. 516 కలశాలతో మహిళా భక్తులు పవిత్ర గంగాజలాలను తీసుకొచ్చి అభిషేకాలను నిర్వహించారు. తొలుత అమ్మవారిని ఊరేగింపుగా బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా తీసుకొచ్చారు. భక్తులందరికీ బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. భవానీ గురుస్వాములు సూది వెంకట్రావు, తుమ్మల సుబ్బారావు, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, స్థానిక అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చెంచులు సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

యర్రగొండపాలెం: నల్లమల అడవుల్లో నివసిస్తున్న చెంచులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారి కుంజ్ బిహారి అన్నారు. మండలంలోని వెంకటాద్రిపాలెం అంకమ్మ చెంచుగూడెం, పునరావాస చెంచు కాలనీలలో శుక్రవారం జరిగిన పీఎం-జన్ మన్ కార్యక్రమంలో ఆయన చెంచులతో మాట్లాడారు. గృహాలు లేని చెంచులకు పక్కాగృహాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పూర్తి వివరాలతో తమ పేర్లను మొబైల్‌యాప్‌లో నమోదు చేసుకొని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీ గిరిజనాభివృద్ధి శాఖ ప్రతినిధి హరికృష్ణ, పీఎంయూ ఫీల్డ్ అధికారి మధుసూదన్, డీఎల్‌డీఓ బీవీఎస్ సాయికుమార్, ఎంపీడీఓ వైవీ నాగేశ్వరప్రసాద్, శ్రీశైలం ఐటీడీఏ అదనపు పీఓ ధనుంజయరావు, ఎస్ఓ నాగేశ్వరరావు, హౌసింగ్ డీఈ సురేష్ పాల్గొన్నారు.



చెంచులతో మాట్లాడుతున్న కేంద్ర గిరిజన సంక్షేమ శాఖాధికారి కుంజ్ బిహారి

చికిత్స పొందుతూ యువకుడు మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన శ్రీనివాసులు

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని తూర్పుగంగవరం గ్రామానికి చెందిన బొట్ల శ్రీనివాసులు(28) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.రమేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తూర్పుగంగవరం గ్రామానికి చెందిన బొట్ల శ్రీనివాసులు స్థానిక రెస్టారెంట్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం 27వ తేదీన జ్వరం ఉందని కుటుంబ సభ్యులకు తెలిపి ఇంటి వద్దే ఉన్నాడు. కుటుంబ సభ్యులు పొలం వెళ్లగా మద్యం తాగుతూ తిరుగుతూ ఉన్నాడు. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఇంటి ఆవరణలో ఉన్న గడ్డి మందు తాగాడు. చుట్టు పక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వెంటనే ఒంగోలుకు తరలించి చికిత్స అందించారు. 28వ తేదీన మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య అరుణకుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంకితభావంతో పనిచేసి ఉన్నతంగా రాణించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సిటీ: అంకితభావంతో పనిచేసి ఉన్నతంగా రాణించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. కారుణ్య నియామకం కింద సయ్యద్ ఖాసీం తనయుడు సయ్యద్ షాహాబాద్ ఊహాసేనికి కలెక్టర్ శుక్రవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఏ పని అప్పగించినా బాధ్యయుతంగా పని చేసి ఉన్నతాధికారుల గుర్తింపు పొందాలన్నారు. అనంతరం కారుణ్య నియామక పత్రం అందుకున్న సయ్యద్ షాహాబాద్ ఊహాసేని కలెక్టర్, డీపీఓ కృతజ్ఞతలు తెలిపారు. డీపీఓ పరిపాలనా అధికారి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కారుణ్య నియామకపత్రం అందజేస్తున్న కలెక్టర్

'గిన్నిస్' నాట్య ప్రదర్శనలో వైపాలెం చిన్నారులు

యర్రగొండపాలెం: స్థానిక శ్రీవేంకటేశ్వర భరత నాట్య అకాడమీ విద్యార్థులు గిన్నిస్ రికార్డు సాధించారు. ఈ నెల 24న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ప్రపంచస్థాయి నృత్య ప్రదర్శనలో 3,782 మంది పాల్గొన్నారు. వారిలో భరత నాట్య అకాడమీ నాట్య గురువు, నంది అవార్డు గ్రహీత మందుల భారతీ నాయుడు ఆధ్వర్యంలో యర్రగొండపాలేనికి చెందిన తాళ్లపల్లి నాగబాల నందిని, తాళ్లపల్లి నాగబాల వైష్ణవి, మందుల సాయి ఆహ్లాదిత, పిండి తేజస్విని, నవీన ఉన్నారు. 7 నిమిషాలపాటు నృత్య ప్రదర్శన చేసి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించారు. పూర్తిగా వెనబడిన ప్రాంతం నుంచి ప్రపంచ స్థాయి వేదికపై నాట్యం చేసి రికార్డు సాధించడం గొప్ప విషయమని పలువురు అభినందించారు.



గిన్నిస్ రికార్డు సాధించిన చిన్నారులతో నాట్య గురువు భారతీనాయుడు

పురుగు మందు తాగి గుర్తు తెలియని వృద్ధుడు మృతి





వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ: పురుగు మందు తాగి గుర్తు తెలియని వృద్ధుడు(75) కనుమళ్ల పంచాయతీ పొలాల్లో మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. కనుమళ్ల చెరువు సమీపంలోని జామాయిల్ తోటలో పురుగు మందు తాగి వృద్ధుడు మరణించినట్లు సమాచారం అందడంతో ఎస్సై టి.శ్రీరామ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని శరీరంపై తెలుపు పంచె, తెల్ల చొక్కా ఉన్నాయని, వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులు పట్టించుకోకపోవడంతో మానసిక ఆందోళనతో ఈ ప్రాంతానికి వచ్చి పురుగు మందు తాగి చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడి వివరాలు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరుఏరియాఆస్పత్రికితరలించినట్లు ఎస్సై చెప్పారు. ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, సుమన్ ఉన్నారు.

భైరవకోన హుండీ ఆదాయం రూ.8.53 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం భైరవకోనకు కార్తీక మాసం టిక్కెట్లు, హుండీ లెక్కింపు ద్వారా రూ.8,53,538 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ సిద్ధురమణారెడ్డి, ఈఓ నర్రా నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ ఇన్‌స్పెక్టర్ జీపీ సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వాహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ సిద్ధు రమణారెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా హుండీ ఆదాయం రూ.4,27,673, కార్తీకమాసం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.4,25,865 ఆదాయం వచ్చినట్లు ఈఓ, చైర్మన్ తెలిపారు. నల్లమడుగుల ఎంపీటీసీ ముడుమాల నారాయణరెడ్డి, సిద్ధు వెంకటరెడ్డి, బసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.